కథావేదిక

# ప్రాణహానేశ్వరుడు

## - ఇమంది రామారావు

''ఏవండీ...'' గట్టిగా అరిచింది స్వరూప.

తను చూస్తున్నది నిజం కాకూడదు. కాని ఇది నిజం...

చక్రి ఆత్మహత్య చేసుకున్నాడన్న విషయం పక్కనే ఉన్న డెయిరీ ధృవపరుస్తోంది. చక్రి పెద్ద బిజినెస్ మాగ్నెట్. సిటీలో ఎక్కడ చూసినా చక్రి ఆస్తులే. నగరం నడిబొడ్డున బంగళా... ముత్యాల్లాంటి ఇద్దరు బిడ్డలూ, అందమైన భార్య ఇన్నీ వున్న తనెందుకు ఆత్మహత్య చేసుకోవాలి? ఆలోచనలు స్వరూప మెదడును తొలిచేస్తున్నాయి.

కూతురు శివ, కొడుకు విష్ణు.. కవలలిద్దరూ తల్లిపెట్టిన గావుకేకకి ఠుళ్ళిపడిలేచారు.

క్షణాల్లో ఈవార్త నగరమంతా ప్రాకిపోయింది. చక్రధరం ఇంటిముందు కారులు బారులుతీరి నుంచున్నాయి.

హాల్లో చక్రి పార్ట్‌నర్ సుందరమూర్తి తలపట్టుక్కూర్చున్నాడు. మిగతా పార్ట్‌నర్స్ కూడా మతిపోయినట్టు కూర్చున్నారు. చక్రి చేస్తున్న చాలా వ్యాపారాల్లో సుందరమూర్తి ప్రధాన భాగస్వామి.

''ఇలా జరుగుతుందనుకోలేదండీ... చక్రి గొప్ప పారిశ్రామికవేత్తగా ఎదిగే సమయంలో ఇలాంటి పిచ్చి పనెందుకు చేశాడో'' సుందరమూర్తి బరువుగా అన్నాడు.

''అసలు నిజంగా ఆత్మహత్య చేసుకున్నాడో ఒకవేళ ఎవరయినా...'' గుటకలు మింగాడు మరోపెద్దమనిషి. సందరమూర్తి ఠుళ్ళిపడి అతడి ముఖంలోకి పరీక్షగా చూశాడు.

సుందరమూర్తి చక్రధరం ఒక ప్రాణంగా వుండేవారు. కలసి వ్యాపారం చేశారు. ఊహించని స్థాయికి ఎదిగేరు. ఈరోజు తను ఫోర్డు కారులో తిరుగుతూ... బంజరాహిల్స్‌లో బంగళా కలిగివున్నాడంటే... అందుక్కారణం చక్రి తెలివితేటలూ.. వ్యాపార చతురతే. చాలా తెలివైనవాడు... చురుకైనవాడు. సమయం విలువ తెలిసినవాడు... ఇన్ని తెలిసిన 'చక్రి'కి జీవితం విలువ తెలీకుండా పోతుందా?'' సుందరమూర్తి ఆలోచనలో పడ్డాడు.

ఇన్స్‌పెక్టర్ విజయ్... తన సిబ్బందితో వచ్చాడు.

విజయ్ మఫ్టీలో వున్నాడు. విజయ్ దగ్గర సుందరమూర్తికి చాలా చనువుంది.

''సుందరం! అసలేం జరిగిందిరా!'' విజయ్ అడిగాడు.

''ఇది మరీ బాగుందిరా... అది తెలుసుకోవలసింది నువ్వు. చక్రి డైరీలో ఆత్మహత్య చేసుకుంటున్నట్టు స్పష్టంగా రాసుంది.''

''కావచ్చు... పోస్ట్‌మార్టమ్ రిపోర్ట్స్ వచ్చాకగాని... ఏవిషయం తేల్చి చెప్పడం కష్టం.'' క్షణంలో విజయ్ ముఖం సీరియస్‌గా అయిపోయింది.

స్వరూప అక్కడికి వచ్చింది.

''సారీ స్వరూపగారూ... జరిగిందానికి చాలా బాధపడుతున్నాను. మీ జీవితంలో ఏర్పడిన ఈలోటు ఆ భగవంతుడు కూడా భర్తీ చేయలేడు. బట్- డ్యూటీ... తప్పదు.'' అన్నాడు చిన్నపిల్లలిద్దర్నీ ప్రేమగా చూస్తూ.

స్వరూప మాట్లాడలేదు.

''మీరు చక్రధరాన్ని ఎన్నిగంటలకి డెడ్‌బాడీగా గుర్తించారమ్మా?''

''అయిదు గంటలకి. ఉదయం అయిదు గంటలకే లేచే అలవాటుంది.''

''ప్రాణం పోయిందన్న విషయం మీకెలా తెలిసింది?''

స్వరూపకు దుఃఖం ఆగిందికాదు. మౌనంగా చక్రధరం డైరీ అందించింది. అందులో చివరిపేజీలో ఇలా రాసుంది. ''నా తనువు చాలించాలనుకుంటున్నాను. అందుక్కారణాలు శతకోటి. నా చావుకి నేనే కారకుడ్ని!''

మిగతాపేజీల్లో చక్రధరం హాండ్‌రైటింగ్ టాలీ చేశాడు. సరిపోయింది. సుందరం కూడా ఆ హాండ్‌రైటింగ్‌ని పరీక్షగా చూశాడు. నోడవుట్- అది చక్రధరం హాండ్‌రైటింగే.

''ఎనీవే చక్రధరం డెడ్‌బాడీని పోస్ట్‌మార్టమ్‌కి పంపిద్దాం. అసలు... ఎలా... ఎలా జరిగిందన్నది నిర్ధారణవుతుంది'' అన్నాడు విజయ్.

''నా చక్రిని నిలువెల్లా కోస్తే నేను చూడలేను. ఎ... పోయారు? ఎందుకు పోయారు ఇవన్నీ నాకెందుకు... ఇదంతా నా తలరాత'' తలబాదుకుంది స్వరూప.

విజయ్ కళ్ళల్లో అప్రయత్నంగా చిప్పిళ్ళిన కన్నీళ్ళు. సుందరమూర్తి పరిస్థితీ అదే-

''కూల్‌డవున్ మేడమ్. కూల్‌డవున్. ఒకవేళ తెలివిగా ఎవరైనా హత్యచేయచ్చుగా?''

''ఆయన అజాతశత్రువని మీకు తెలీదా? ఆయన్నెవరు హత్య చేస్తారు?''

''అని మీరనుకోవచ్చు. ఆయన అభివృద్ధిని చూసి ఓర్వలేనివాళ్ళు తెలివిగా ఈ హత్య చేయచ్చుగా!'' అన్నాడు సుందరమూర్తిని చూస్తూ.

''విజయ్.. వాట్ డుయూ మీన్?'' అదిరిపడ్డాడు సుందరమూర్తి.

''సుందరం.. నా దృష్టిలో ఒక నిర్దోషికి ఎలా శిక్ష పడకూడదో.. ఒక నేరస్థుడు కూడా పోలీసుల కళ్ళుగప్పి తప్పించుకోకూడదంటాను... వాట్ డుయూసే!?''

''ఎగ్జాట్లీ!''

''వెల్- లెట్ మీ డూ మై డ్యూటీ!'' అంటూ లేచాడు. ఇల్లంతా కలియజూశాడు. ఒకచోట అతని చూపు ఆగిపోయింది.

• • •

సుందరమూర్తి ఇంటికి విజయ్ వచ్చాడు.

విజయ్‌ని చూడగానే 'పోస్ట్‌మార్టమ్ రిపోర్ట్ ఎలా వుంది'' ఆతృతగా అడిగాడు.

''ఆత్మహత్య అనే కన్‌ఫర్మ్ చేశాడు డాక్టరు తిరుపతి.''

''విజయ్.. ఇంకా ఈ కేసు విషయంలో.. నీకు అనుమానాలు ఏవైనా వున్నాయా?

''అనుమానించడం నా డ్యూటీ సుందరం! బైది బై చక్రి భార్య ఎటువంటిది?''

''అంటే... ఏవిషయంలో?''

''కేరక్టర్ విషయంలో!''

''నాకు తెలిసినంతవరకూ చాలా మంచిమనిషి. ఒక్కమాటలో చెప్పాలంటే దేవత లాంటిది. పైగా వాళ్ళిద్దరూ ప్రేమించి పెళ్ళిచేసుకున్నారు!''

''చక్రి ఇంటికి తరచూ వచ్చిపోయే ముఖ్యులెవరు?''

''బిజినెస్ బాగా పెరిగింది. ఎందరో వచ్చిపోతుంటారు!''

''అందులో ముఖ్యులెవరని అడిగాను!''

''నేనే తరచూ వెళ్ళి వస్తుంటాను!''

''నువ్వు సరేరా... ఇంకెవరయినా... ఇంకెవరయినా వున్నారా?'' స్ట్రెస్ చేస్తూ అడిగాడు.

ఇంతలో ఎవరో వ్యక్తి వచ్చాడు.

చాలా అందంగా వున్నాడు.

''రా డేవిడ్ రా!'' ప్రేమగా పిలిచాడు సుందరం.

డేవిడ్ ముఖం పాలిపోయింది. కళ్ళు ఏడ్చి ఏడ్చి

వాచిపోయాయి. దుఃఖాన్ని లోలోపలే దిగ మింగడం కనిపించింది.

''వూరుకో డేవిడ్! అంతా 'మాయ'లా జరిగిపోయింది. నువ్వా సాయంత్రం ఊరెళ్ళడం, తెల్లారేసరికి... చక్రి... మరికలేడు.'' గట్టిగా వూపిరి పీల్చుకున్నాడు.

తనే ప్రయత్నం మీద మాట్లాడుతూ ''విజయ్... డేవిడ్... మాకు ప్రాణంతో సమానం. చాలా సిన్సియర్!'' అంటూ పరిచయం చేశాడు.

డేవిడ్ రెండు చేతులూ జోడించి నమస్కరించాడు. ప్రతిగా నమస్కరించాడు విజయ్. డేవిడ్ ఒక చీటి మీద వివరాలు రాశాడు. సుందరమూర్తికి ఇచ్చి వెళ్ళిపోయాడు. సుందరమూర్తి ఆ చీటీని పరిశీలనగా చూసి-

''చాలా ఆనెస్ట్.. ఈరోజుల్లో కూడా ఇలాంటివాళ్ళుంటారా అన్న అనుమానం కలుగుతుంది. అణాపైసలతో సైతం లెక్కచెబుతాడు'' మెప్పుకోలుగా అన్నాడు.

''ఆనెస్ట్ అన్నావు సరే. కేరక్టర్ ఎటువంటిది?''

''దేవుడులాంటి వాడు!''

''ఎవరికి?''

''విజయ్! డేవిడ్‌ని కలలో కూడా అనుమానించలేం. అఫ్‌కోర్స్ నువు పోలీసాఫీసరువి. అనుమానించడం, అన్వేషించడం నీ డ్యూటీ కావచ్చు. బట్ నాకు దిస్ గై...'' అన్నాడు ఆవేశంగా.



• • •

డేవిడ్ ఇంటి ముందు జీపు ఆగింది. విజయ్ యూనిఫామ్‌లో వున్నాడు. సిటీ ఎక్స్‌టెన్షన్ కావడంవలన నిర్మానుష్యంగా వుంది. చీకటి.. జన సంచారం లేదనే చెప్పాలి. కాలింగ్‌బెల్ నొక్కాడు. వెంటనే తలుపులు తెరుచుకున్నాయి.

ఇన్స్‌పెక్టర్ విజయ్‌ని చూసి డేవిడ్ షాక్ తిన్నాడు. అంతలోనే తమాయించుకొని సాదరంగా ఆహ్వానించాడు.

డేవిడ్ ఇల్లు చాలా ఆర్టిస్టిగ్గా వుంది.

''వాట్‌కెన్ ఐ డూ ఫర్ యూ?'' సవినయంగా అడిగాడు డేవిడ్.

డ్రాయింగ్ రూమ్‌కేసి నడుస్తూ, డ్రాయింగ్ రూమ్ నిండా అందమైన పెయింటిగ్స్ వున్నాయి.

పెన్‌స్టాండ్‌లో ఒక అందమైన పెన్ వుంది.

''ఈ పెన్ను చాలా అందంగా వుంది. నేను తీసుకోవచ్చా!'' విజయ్ అడిగేడు.

''క్షమించండి సర్... అదెవరో ప్రెజెంట్ చేసింది. ఇంకేది కావాలన్నా తీసుకోండి'' దాదాపు బ్రతిమాలుతున్నట్లు చెప్పేడు డేవిడ్.

''మీరు ప్రతిరోజూ బైబిలు చదువుతారా?''

''ఆ పవిత్ర గ్రంథాన్ని తీరికవేళల్లో ఒక్కక్షణం కూడా విడిచిపెట్టను!''

''మీరు సినిమాలు కూడా ఎక్కువగా చూస్తుంటారా?''

''లేద్సార్... ఎప్పుడైనా బోర్‌కొడితే!''

''హాట్ డ్రింక్స్?''

''క్షమించండి సర్.. నాగురించి తెలిస్తే ఇలా మాట్లాడరు. మీరీ ప్రపంచంలో ఎవర్నైనా అనుమానించండి. బట్.. నాట్ మీ.'' చాలా కూల్‌గా అన్నాడు డేవిడ్.

''గుడ్.. సహాయం చేస్తారా?''

''అంతమాటనకండి! మీరు చెప్పండి. చేస్తాను'' అన్నాడు డేవిడ్.

''బైబిల్లో ఓ మంచి వాక్యం ఈ బుక్‌లో రాయగలరా?'' అభ్యర్థనగా అడిగేడు

''ష్యూర్.. ష్యూర్..'' అంటూ ఎడంచేత్తో పెన్ను తీశాడు.

''మీరు లెఫ్ట్‌హాండరా?''

''అవునండి!''

''కుడిచేత్తో రాయండి చూద్దాం. ఇలాంటి తమాషాలు చేయడం నాకిష్టం!''

డేవిడ కుడిచేత్తో బైబిల్లో ఓ మంచి వాక్యం రాసిచ్చాడు.

''మీరు సవ్యసాచి రెండు చేతుల్తో అందంగా రాయగలుగుతున్నారు. మీ హైట్?''

''ఫైవ్ టెన్!''

''మీ షూష్ నెంబరు?''

''నైన్- ఆర్ టెన్ అనుకుంటాను!''


''గమ్మత్తయిన పర్సనాలిటీ మీది. ఓ.కె. డేవిడ్.. సారీ ఫర్ ది ట్రబుల్-'' బయటికి నడిచాడు విజయ్.

విజయ్‌ని జీపువరకూ సాగనంపేడు డేవిడ్.

విజయ్ జీపు స్టార్ట్ చేస్తూ, ''స్వరూపగారు మీగురించి చాలా చెప్పేరు!'' అన్నాడు.

''నాదృష్టిలో చక్రధరం దేవుడు. స్వరూప దేవత. వారిని గురించి కలలో కూడా చెడుగా ఊహించలేను. ఇది నా బైబిలు సాక్షిగా చెబుతున్న సత్యం!'' అన్నాడు సిన్సియర్‌గా చేతులు జోడిస్తూ.


## కన్నడ హీరో





సాయికుమార్ తెలుగులో ఇంచుమించు కనుమరుగయ్యే స్థితిలో వున్నాడు. ఒకరకంగా అతడు దురదృష్టవంతుడు. అయితే మరోరకంగా అతడు అదృష్టవంతుడని చెప్పొచ్చు. దురదృష్టవంతుడని అనడం ఎందుకంటే అతడు చేసిన తెలుగు సినిమాలు వరుసగా ఫ్లాపులయ్యాయి. ఒకటీ అరా హిట్ అయినా అతడికి రావలసినంత పేరు రాలేదు. అందుకు కారణాలు అనేకం. తెలుగు తెరకు దూరమవుతున్న ఈ నటుడికి ఇప్పుడు కన్నడ రంగం నుండి అవకాశాలు బోలెడు వస్తున్నాయి. తన మాతృభాషయిన తెలుగులో సక్సెస్ కాలేకపోయినందుకు బాధపడుతూనే, తనకు హీరోగా గుర్తింపు తెచ్చిన కన్నడ రంగంలో తను తిరిగి బిజీ అవుతున్నందుకు ఆనందపడుతున్నాడు సాయికుమార్. ఆదరించలేకపోయినా, ఆనందంగా వున్నందుకు అభినందిద్దాం.

**- జి.వి.బాబు**




• • •

''సుందరం! ఇంకాస్సేపట్లో స్వరూప దగ్గర్నుంచి నీకు ఫోనొస్తుంది'' కాఫీ సిప్ చేస్తూ అన్నాడు విజయ్.

''కలగన్నావా?''

''పదిలక్షల కేష్‌తో నిన్ను వెంటనే రమ్మంటుంది!''

''నన్ను కేష్‌తో రమ్మనడమేవిటీ?''

''అదే సస్పెన్స్.''

''అయితే సస్పెన్స్ కథలు రాసుకో. పారితోషికం ముడుతుంది. విజయ్.. నిన్ను మొదట్నించీ గమనిస్తున్నాను. నువ్వు నన్ను అనుమానిస్తున్నావు. ఔనా?'' సీరియస్‌గా అడిగాడు.

''ఎలా చెప్పగలవు?''

''నన్ను నీడలా వెంటాడుతున్నావంటే అదేగా...''

''కావచ్చు!''

''విజయ్... స్వరూపంటే నాకు అభిమానం కానీ నువ్వనుకున్నట్లు..'' అంటుండగా సెల్‌ఫోన్ రింగయింది. అవతలిగొంతు స్వరూపది అని గుర్తుపట్టగానే సుందరం సీరియస్‌గా బెడ్‌రూమ్‌లోకి నడిచాడు. మాట్లాడేడు, వచ్చాడు. విజయ్ సుందరం చేతిలో సెల్‌ఫోన్ తీసుకొని బటన్ ఆన్ చేసి... నెంబరు నోట్ చేసుకొని తిరిగిచ్చేశాడు.

సుందరం హడావుడిగా కారు దగ్గరికి నడిచాడు.

''స్వరూప దగ్గరికేనా?'' వ్యంగ్యంగా అడిగేడు.

''...'' సుందరం సమాధానం చెప్పలేదు.

''బెస్టాఫ్ లక్!'' అన్నాడు విజయ్. సుందరంని ఫాలో అవుతూ.

• • •

''డాక్టరు తిరుపతిగారూ! ఇవి చేతులు కావు'' అన్నాడు ఓ పల్లెటూరి మొద్దు.

తిరుపతి చూడ్డానికి పండుకోతిలా వున్నాడు. కాలుకాలిన పిల్లిలా తిరుగుతూ ''మీకేం కావాలో చెప్పండి.. మీరెంతిచ్చుకోగలరో చెప్పండి. అసలు మీరెవరో మీదే వూరో చెప్పండి?'' ప్రశ్నల వర్షం కురిపించాడు.

''అయ్యా... మాది పక్కనే వున్న ఘటకేసరండీ.''

''పాయింట్‌కొచ్చెయ్!''

''ఒకడ్ని నెలరోజుల క్రితం చంపేశానండీ. అది మర్డరు కాదూ... ఆడే పోడుచుకు చచ్చాడని సర్టిఫికేటివ్వాల!''

''నంవ్వేంతిస్తావ్?''

''అంఎందంవేలు!''

''పదికి పదిపైసలు తక్కువైనా మాట్లాడకు. వచ్చిన దారిన వెళ్ళిపో. నా ద్రు చూశావా! టైమ్ ఈజ్ మనీ... మనీ ఈజ్ గాడ్. దైవద్రోహం తలపెడితే నేను క్షమించలేను!''

''అలాగేనండీ... మీరడిగిన పదివేలూ ఇస్తా నన్ను తొందరగా పంపించండి'' అన్నాడు పల్లెటూరి మొద్దు వేషంలో వున్న విజయ్.

• • •

సుందరం, డేవిడ్ ఇద్దరూ టిఫిన్ చేస్తున్నారు. స్వరూప వారికెదురుగా కూర్చొని కబుర్లు చెబుతోంది. స్వరూప కోలుకున్న ఛాయలు కనిపిస్తున్నాయి.

అక్కడికి యూనిఫామ్‌లో వచ్చాడు విజయ్.

విజయ్ రాక చూసిన సుందరం స్వరూప తృళ్ళిపడ్డారు.

''రండి. రండి.. మీరు కూడా టిఫిను చేద్దురు రండి!'' సోఫా చూపించింది కూర్చోమన్నట్లు.

''ఏవిటిలా సడెన్‌గా. వేడి వేడి పెసరట్లు తింటావా?'' చనువుగా అడిగాడు సుందరం విజయ్ రాకకు ఆశ్చర్యపోతూ.

''పెసరట్లు తినడానికి రాలేదు సుందరం. తినిపించడానికి వచ్చాను. చక్రధరానిది ఆత్మహత్య కాదు హత్యే!''

అంతా అదిరిపడ్డారు.

''హత్యా?'' ఫ్రీజ్ అయిపోయింది స్వరూప. మిగతా వారిద్దరి పరిస్థితీ అదే.

''విజయ్. జోకులెయ్యకు. ఇది సమయం కాదు'' షాక్‌లోంచి తేరుకొంటూ అన్నాడు సుందరం.

''జోకులు కాదు సుందరం. హంతకుడు కనిపించాడు.. దొరికేడు!''

''ఎవరూ? అబ్బ.. సస్పెన్స్‌తో చంపక. చెప్పూ'' తొందర చేశాడు సుందరం.

''య్యస్..'' చెప్తా. తప్పదుకదా. సమయం దగ్గరపడింది. ఆరోజు నువు డేవిడ్‌ని కరీంనగర్ పంపించావు కలెక్షన్స్‌కోసం... గుర్తుందా!''

''గుర్తుంది!''

''కానీ... ఆరోజు డేవిడ్ కరీంనగర్ వెళ్ళలేదు. స్వరూపతో 'లంభా' థియేటర్‌కి వెళ్ళాడు. 'బేసిక్ ఇన్‌స్టింక్ట్' సినిమా చూశాడు!''

''నాతోనా... నో.. నో.''

''అంత గొంతు చించుకొని అరవ్వలసిన అవసరం లేదు. ఇదిగో డేవిడ్ బైబిలులో భద్రపరుచుకున్న సినిమా టికెట్టు 'జి ఎయిట్'. ఇదిగో మీ ఇంట్లో మొన్న టిరోజు నాకంటపడిన సినిమా టికెట్ 'జి సెవెన్' అంటూ టికెట్లు చూపించి కోటు జేబులో పెట్టుకున్నాడు.

''ఇదన్యాయం. సినిమా టికెట్ల ఆధారంతో నన్ను ముద్దాయిని చేయడం అన్యాయం!'' అరిచాడు డేవిడ్.

''నాకు తల తిరిగిపోతుంది సుందరంగారూ! కేసు కావాలని ఏడిపిస్తున్నట్టుగా వుంది!''

''కీప్ క్వయిట్ స్వరూపా. మీరు డేవిడ్ ప్లాన్ చేసుకొని చాలా తెలివిగా చక్రధరంని మర్డర్ చేశారు. చక్రికి రాత్రిళ్ళు బాగా తాగే అలవాటుంది. ఆరోజు పీటర్స్కాచ్ని పోలమాంబ వైన్స్ నుంచి డేవిడ్ తీసుకొచ్చాడు. మధ్యదారిలో ఫ్రెండ్స్ ప్రొవిజన్స్లో బేగాన్స్ప్రే తీసుకున్నారు. ఈ ఆధారాలు నాకెలా తెలిశాయని ఆశ్చర్యపోతున్నారా! అవసరం అన్వేషణకి మాతృక. చక్రి డెయిరీలో ఫ్రెండ్స్ ప్రొవిజన్స్లోనూ, పోలమాంబవైన్స్లోనూ ఖాతావున్నట్లు తెలిసింది. ఆరోజు డేవిడ్ ఏం చేశాడో తెలుసుకోడానికి ఆట్టేసేపు పట్టలేదు. ఈ నిజాలు ఆ షాపు ఓనర్లు చెప్పారు.''

''అబద్ధం.. కావాలని కట్టుకథలల్లుతున్నారు. మమ్మల్ని కక్ష్యతో నేరస్థుల్ని చేస్తున్నారు! మైలార్డ్!''

''షటప్... దేవుడ్ని తలచకురా... దేవాంతకులు మీరు.''

ప్రతిమల్లా వుండిపోయారిద్దరూ.

స్వరూప ముఖంలో నెత్తురుచుక్కలేదు.

''స్వరూపా ఆరోజు.. శుక్రవారం రాత్రి పదకొండు గంటల ప్రాంతంలో సుందరం ఫోన్ చేశాడు. ఔనా?''

''ఔను!'' సుందరం ఒప్పేసుకున్నాడు.

''మరో అయిదు నిముషాల్లో ఇంకో ఫోనొచ్చింది. చేసిందెవరు?''

''....''

''నేనే చెప్తాను. డేవిడ్ చేశాడు ఔనా?''

''నో.. నో.''

''స్కౌండ్రల్. ఎంతకు తెగించావురా. నేను మీరు మాట్లాడుకున్న మాటలన్నీ విన్నాను. ముషీరాబాద్ ఎక్స్చేంజ్లో జంక్షన్ బాక్స్ దగ్గర కూర్చుని మీ మాటలన్ని రికార్డ్ చేయడం కూడా జరిగింది. ఆ మాటలు వినండి!'' అంటూ పోర్టబుల్ టేప్రికార్డర్ ఆన్ చేశాడు. సుందరం ఖంగుతిన్నాడు.

స్వరూప, డేవిడ్లు సిగ్గుతో తలలు వంచేశారు.

''ఇదంతా..'' ఏదో చెప్పబోయింది స్వరూప.

''దయచేసి ఇంకేం చెప్పకండి. నేను డేవిడ్ ఇంటికెళ్ళాను. డేవిడ్ పెన్స్టాండ్లో.. యస్ మార్కుతో 'అయ్ లవ్ యు' లెటర్సున్న పెన్ని స్వరూప ప్రెజెంట్ చేసుంటుందని గమనించాను. అందుకే అది కావాలని అడిగేను. పాపం గట్టి ప్రేమబంధం కదా.. నో అనేశాడు డేవిడ్. డేవిడ్ చాలా తెలివైనవాడు. అందుకే తన రహస్యాలన్నీ బైబిలు బుక్లోనే పవిత్రంగా భద్రపరిచాడు. డేవిడ్ బైబిలులో వాక్యం ఎందుకు రాయమన్నానో తెలుసా?''

అడ్డంగా తలూపుతూ... అసహనంగా చూశాడు.

చక్రధరం డెయిరీలో వున్న హాండ్ రైటింగూ... నువు కుడిచేత్తో రాసిన హాండ్ రైటింగూ ఒకటే అని కన్ఫర్మ్ చేసుకోడానికి! ఎగ్జాట్లీ నేను అండర్లైను చేసిన అక్షరాల్ని చూడు సుందరం!'' చూపించాడు.

''ఆరి దౌర్భాగ్యుడా!'' డేవిడ్ని నమిలి మింగేసేలా చూశాడు.

''చక్రధరంతో బాగా తాగించి లాస్ట్ పెగ్స్లో బేగాన్స్ప్రే కలిపిచ్చావు. 'చక్రి' చనిపోయాడని నిర్ధారణకొచ్చింతరువాత నువు దొడ్డిదారిగుండా పారిపోయావు. నువ్వన్న నెంబరువైతే షూ ప్రింట్సు నీవే. నీ నెంబరు టెన్. కాని నైన్ వేసుకు తిరుగుతున్నావు తెలివిగా. చక్రి చనిపోయిన రోజున నువ్వేసుకున్న షూష్ నెంబరు నైన్. ఆ విషయం నువ్వే ఒప్పుకున్నావుగా.

''నా వుద్దేశ్యం అది కాదు!''

''ఈ నేరాన్ని తెలివిగా సుందరం మీదకి తోసెయ్యాలనుకున్నావు అవునా?''

''అలాగెందుకనుకుంటాను. చక్రధరంగారు ఆత్మహత్య చేసుకున్నట్లు కన్ఫర్మ్ అయ్యింది కదా?!''

''డాక్టరు తిరుపతి దొంగ సర్టిఫికెట్ ఇచ్చాడు. కన్నబిడ్డకంటే మిన్నగా చూసుకొనే చక్రధరంనీ, సుందరాన్నీ మోసం చేశావ్. సికింద్రాబాద్లో వున్న ఓ ప్రైవేట్ బ్యాంకులో పందొమ్మిది లక్షల ఛేంజ్ వుంది. అంత డబ్బు ఎలా సంపాదించావు?''

సుందరం నెత్తిమీద బాంబు పేలినట్లు ఫీలయ్యాడు.

''విజయ్.. యు ఆర్ రియల్లీ గ్రేట్- ఇంత త్వరగా ఎల్లా ఇన్వెస్టిగేట్ చేయగలిగేవ్?'' ఆశ్చర్యంగా అడిగేడు సుందరం.

''మనసుంటే మార్గాలేవుండవా సుందరం! ఈరోజు బ్రేక్ఫాస్ట్కి పిలిచింది కూడా ఇంపార్టెంట్ డాక్యుమెంట్స్ మీద సంతకాలు చేయించుకొని బొంబాయి చెక్కెయ్యడానికే. ప్రైవేట్ ట్రావెల్స్లో టికెట్స్ కూడా రిజర్వ్ చేశారు అవునా?'' స్వరూపకేసి సీరియస్గా చూశాడు విజయ్.

''నాకేం తెలీదు. నేను మోసపోయాను. నేను పిచ్చిగా ప్రాణ సమానంగా డేవిడ్ని నమ్మాను. అతను చెప్పిందల్లా చేశాను. అతని చేతిలో కీలుబొమ్మనైపోయాను. నేను పాపాత్మురాల్ని!'' తలబాదుకొని భోరున ఏడ్చింది స్వరూప.

''ఓ.కె.! మీతోబాటు ఆత్మహత్య అని దొంగ సర్టిఫికేట్ ఇచ్చిన డాక్టరు తిరుపతి కూడా ఈసరికి పోలీస్స్టేషన్లో ఊచలు లెక్కపెడుతుంటాడు. అతడికి తోడుగా మీరూ పదండి!'' అన్నాడు సీరియస్గా.

సుందరం స్థాణువులా వుండిపోయాడు. కృతజ్ఞతగా విజయ్కేసి చూడగలిగేడు.

స్వరూప డేవిడ్ ముఖంలోకి చూసింది. భయంకరంగా కనిపించాడు. గోముఖ వ్యాఘ్రంలా అనిపించాడు. నిన్న ప్రాణేశ్వరుడు.. ఈరోజు ప్రాణహానేశ్వరుడు!!

స్వరూపకి కాలికింద భూమి కదిలిపోతున్నట్లనిపించింది.

★



## ఊకదంపుడు

వేదికమీద అనర్గళంగా ఉపన్యాసమిస్తున్న మాజీమంత్రి ముందువరుసలో కూర్చున్న ఓ శ్రోతను పిలిచి అడిగాడు ''నేను ఏకధాటిగా ప్రసంగిస్తుంటే నువ్వేమిటి ఆ ప్రక్కన వున్న ఊకగుట్టవైపు చూస్తున్నావు?''

''రియాల్టీకోసం ఊకగుట్టవైపు చూస్తూ మీ ఊకదంపుడు ఉపన్యాసం వింటున్నానండి మరి!''

- తమ్మిశెట్టి భుజంగరావు (పాలకొల్లు)

## టైమ్

''మీరిద్దరూ హాయిగా ఉద్యోగం చేస్తూ లైఫ్ను ఎంజాయ్ చేస్తున్నారని అందరూ అంటుంటే నువ్వేమో టైం కలిసి రావట్లేదు అంటావేంటి?'' అడిగాడు తేజ తన చిన్ననాటి మిత్రుడ్ని.

''నాది నైట్ డ్యూటీ జాబ్. మా ఆవిడ్దేమో డే డ్యూటీ జాబ్మరి!'' చెప్పాడు అసలు విషయం.

- తమ్మిశెట్టి భుజంగరావు (పాలకొల్లు)

## తేడా

''నాన్నా! శాస్త్రీయ సంగీతానికి డిస్కోకివున్న తేడా ఏమిటి?'' అడిగింది కూతురు.

''ఆడించడంలోనే తేడా. ముందు దానికి తల లాడిస్తారు. వెనకదానికి కాళ్ళాడిస్తారు.''

- చందూవంశీ (ప్రొద్దుటూరు)

